కొత్త సీసా..పాత మద్యం



మద్యం ధరలు తగ్గిస్తాం.. నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి తెస్తాం.. క్వార్టర్ మద్యం రూ.99కే విక్రయిస్తాం..అంటూ గొప్పలు పోయిన కూటమి ప్రభుత్వం .. ఆచరణలో అబద్ధమని తేలిపోయింది. దీంతో మందుబాబులకు మాత్రం చిల్లు పెడుతోంది. ఏదో ఊహించుకొని దుకాణాల వద్దకు వెళితే కొత్తగా మార్కెట్‌లోకి తెస్తామన్న సీ– బ్రాండ్ కనిపించకపోవడంతో మందుబాబులు నిరాశ చెందుతున్నారు. విధిలేక ఇతర బ్రాండ్లను కొనుగోలు చేస్తున్నారు. అడిగితే స్టాక్ రాలేదన్న మాట ప్రతి దుకాణం వద్ద వినిపిస్తోంది. మద్యం ప్రియులకు కొత్తసీసా.. పాత మద్యమే అన్నట్లుంది.

– రాయదుర్గం:

- రూ.99కే మద్యం ఉత్తిదే!
- దుకాణాల్లో కనిపించని సీ– బ్రాండ్
- బాటిల్ పై అదనంగా వసూళ్లు
- తొలిరోజు నుంచే ఎమ్మార్పీ విక్రయాలకు చెల్లు
- ఏరులై పారుతున్న మద్యం
- గొలుసు దుకాణాలకు పెరుగుతున్న పోటీ

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 37 ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. లాటరీ ద్వారా దుకాణాలను దక్కించుకున్న యజమానులు ఈ నెల 16న అధికారికంగా ప్రాంభించారు. అయితే కొన్ని చోట్ల అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 దాక విక్రయిస్తుండగతా, కొన్నిచోట్ల అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు మందుబాబులు చెప్పుకుంటున్నారు. కాగా విక్రయాల్లో 90 శాతం మద్యం గత ప్రభుత్వ హయాంలోనిదే కనిపిస్తోందంటూ మందుబాబులు అంటున్నారు.

ఇది నా అడ్డా ..అంటూ బెదిరింపులు:
కూటమి నేతలు కీలక వ్యాపార సర్కిళ్లపై కన్నేసి అడ్డాగా మార్చుకున్నారు. కలెక్షన్లు ఎక్కువ వచ్చే సెంటర్లలోనే దుకాణాలు తెరిచేలా చక్రం తిప్పారు. ఆ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులకు అద్దెకు ఇవ్వకుండా అడ్డుపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నడిపిన ప్రభుత్వ దుకాణ గదులను లీజుకు దక్కించుకున్నారు. కొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడి దుకాణాలు లాక్కునేలా కుట్ర చేశారు. అద్దెకు గదులిస్తే కబడ్దార్ అంటూ ఆయా ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. కంబదూరు మండల కేంద్రంలోని నాలుగు దుకాణాలు తొలిరోజు ప్రారంభం కాకపోవడమే ఇందుకు నిదర్శనం. కుందుర్పి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోనూ మద్యం షాపులు దక్కించుకున్న వ్యక్తులపై బెదిరింపులకు పాల్పడినట్లు వినిపిస్తోంది.

మద్యం దుఖాణాలు ఇలా..

నియోజకవర్గం	మద్యం దుకాణాల సంఖ్య
రాయదుర్గం	14
కళ్యాణదుర్గం	10
ఉరవకొండ	13
మొత్తం	37

రాయదుర్గంలోనూ ఓ దుకాణంపై కావాలనే స్థానికులను రెచ్చగొట్టి ఫిర్యాదులు చేయించినట్టు కూడా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా వేర్వేరుగా విక్రయాలు సాగిస్తారా? లేక అంతా కలసి సిండికేట్‌గా మారుతారో వేచి చూడాల్సి ఉంది. కొన్ని దుకాణాల్లో వాటర్ ప్యాకెట్లు, స్నాక్స్ కోసం బొరుగులు ఉచితంగా ఇచ్చి వ్యాపారం రాబట్టుకుంటే, మరికొందరు దాబాలు, హోటళ్లకు, మద్య హోల్‌సెల్ ధరలకు ఇస్తూ విక్రయాలు పెంచుకుంటున్నారు.

రూ.లక్ష కొట్టు .. బెల్టుషాపు పట్టు ?
మద్యం లైసెన్స్ దుకాణాల వంతు పూర్తయ్యింది. తాజాగా పల్లెల్లో గొలుసు దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. కూటమి నేతల్లోనే వీటికి పోటీ ఎక్కువైంది. నాకంటే.. నాకు అని రచ్చకెక్కే పరిస్థితికి వచ్చింది. గొలుసు దుకాణం కావాలంటే ఎవరైనా సరే రూ.లక్ష కొట్టు.. బెల్టుషాపు పట్టు అన్న తీరులో వ్యవహారం సాగుతున్నట్టు బహిరంగంగా చర్చసాగుతోంది. తమను భాగస్వామ్యం చేయాలని, పార్టీ కోసం తాము ఎంతో కష్టపడ్డామంటూ కూటమి నేతలు కొందరు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. ఏదిఏమైనా మరో వారం రోజుల్లోపు ఊరూరా మద్యం ఏరులై పారనుంది.

క్లుప్తంగా

సిద్ధప్ప మృతి పార్టీకి తీరనిలోటు



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: రంగచేడుకు చెందిన నాయకుల సిద్ధప్ప మృతి పార్టీకి తీరనిలోటు అని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని రంగచేడు గ్రామంలో నాయకుల సిద్ధప్ప (60) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మెట్టు గోవిందరెడ్డి గ్రామానికి చేరుకొని సిద్ధప్ప మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారెక్క, మాజీ ఎంపీపీ యశోదమ్మ, నాయకులు లక్ష్మన్న, వెంకటేశులు, శివ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



మహాశివ్ షార్ట్ ఫిలిం టీంను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కంబదూరు: మహాశివ్ అనే తెలుగు షార్ట్ ఫిలింకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఈ ప్రాంతానికి గర్వకారణమని మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ దాసరి రామ్మోహన్, సర్పంచ్ రాజగోపాల్ తెలిపారు. మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ దర్శకత్వంలో మహాశివ్ అనే షార్ట్ ఫిలిం తీశాడు. ఈ షార్ట్ ఫిలిమ్‌కు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఒడిశా వారు ఉత్తమ షార్ట్ ఫిలిం కింద ఎంపిక చేశారు. ఒడిశాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఒడిసా– 2024' కార్యక్రమంలో డైరెక్టర్ కార్తీక్‌కు అవార్డును అందించారు. ఆదివారం నూతిమడుగు గ్రామంలో డైరెక్టర్ కార్తీక్, టీం సభ్యులను గ్రామ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సన్న ఆంజనేయులు, పెద్ద ఎర్రిస్వామి, టీచర్ సుధాకర్, భునేంద్ర, లాయర్ ముత్యాలు, రఘు పాల్గొన్నారు.

కాపర్ వైరు అపహరణ



కోనంపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లిన దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని కోనంపల్లి వద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైరును దుండగులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. విద్యుత్‌శాఖ ఏఈ గంగాధర్ మాట్లాడుతూ కోనంపల్లి ఘటనపై పోలీసులకు సమాచారం అందించామని రైతులతో కలసి ఫిర్యాదు చేస్తామన్నారు.

పాడుబడిన పోస్టుమార్టం గది



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం గది పాడుబడిపోయింది. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినా, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నా, ఏ ఇతర కారణాలతో మృతి చెందినా.. మృతదేహాన్ని మాత్రం ఇదే గదిలోకే తీసుకొస్తారు. ప్రస్తుతం ఉన్న గదికి ముందు రూ.కోట్లతో ఆస్పత్రిని నిర్మించిన కాంట్రాక్టర్లు పోస్టుమార్టం గదిని నిర్మించలేకపోయారు. దీంతో తలుపులు లేని గదిలోనే పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి సమయంలో మృతదేహాన్ని కుక్కలు, పందులు తినేసినా ఇక్కడ దిక్కులేదని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలోని పోస్టుమార్టం గది నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అయినా చొరవతీసుకొని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

కంబదూరు: మండలంలోని జెల్లిపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. విద్యుత్ స్తంభాన్ని మార్చాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెప్తున్నారు.

దాయాదుల మధ్య గొడవ

విడపనకల్లు: మండలంలోని పాలికి గ్రామంలో పైపులైన ధ్వంసం చేశారని దాయాదుల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. వివరాలు.. పాలికి గ్రామంలో కుమ్మరి ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మి, కుమ్మరి నాగభూషణం, ఆంజనేయులు, లక్ష్మి దాయాదులు. అయితే కొన్నేళ్లుగా ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మి పొలం నుంచి నాగభూషణ, ఆంజనేయులు, లక్ష్మి పైపులైన్ వేసుకొని పంటల పొలాలకు వంకనీరు పారించుకునేవారు. ఇటీవలకాలంలో వీరి మధ్య ఘర్షణ తలెత్తింది. గ్రామంలోని పెద్ద మనుషులు గొడవను సద్దుమణిగించారు. అయితే ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మిలు ఆదివారం కుమ్మరి నాగభూషణ, ఆంజినేయులు, లక్ష్మికి చెందిన పైపులైన్‌ను పగలకొట్టారు. దీంతో ఇరువురు రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో కుమ్మరి నాగభూషణ,ఆంజనేయులు,లక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. నాగభూషణ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులకు నాగభూషణ, ఆంజనేయులు, లక్ష్మి ఫిర్యాదు చేశారు.



తలకు తీవ్రంగా గాయమైన నాగభూషణ



కుమ్మరి ఆంజనేయులు



కె.లక్ష్మి

సమస్యలు పరిష్కరించాలని నిరసన

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాల్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మున్సిపాల్ కార్మికులు సీఐటీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్మికుల జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాల్ కార్మికుల సమస్యల పరిష్కరిస్తామని పట్టించుకోలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 28న మున్సిపాల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాల్ కార్మికులు ఎల్లక్క, అలివేలమ్మ, సరస్వతి, జై గంగాధర్, శివయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఆశ్రమానికి అనాథ మహిళ తరలింపు



మతిస్థిమితం లేని మహిళ

రాయదుర్గం టౌన్: పట్టణంలోని 21వ వార్డు మారెమ్మగుడి వద్ద ఒంటరిగా ఉంటున్న మతిస్థితి మితం లేని అనాథ మహిళను స్వచ్ఛంద సంస్థల సహకారంతో నార్పల మండలం కురగానపల్లి చెన్నకేశవ అనాథ వృద్ధాశ్రమానికి ఆదివారం తరలించారు. ఊరు,పేరు తెలియని ఆ మహిళ బాగోగులను కాలనీవాసులు చాలా రోజుల నుంచి చూసుకుంటున్నారు. మతిస్థిమితం లేని మహిళ అని కాలనీవాసుల ద్వారా సమాచారం అందుకున్న ఛేంజ్ ఫర్ సొసైటీ ఆర్గనైజేషన్ సభ్యులు దాతల సహకారంతో అనాథాశ్రమానికి పంపించారు. కార్యక్రమంలో జబీవుల్లా, పార్వతి, నాదెల్, పార్వతి, మంజునాథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దశభుజ గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డుకిరువైపులా కంపచెట్ల తొలగింపు

బ్రహ్మసముద్రం : మండంలోని భైరవానీతిప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని పోలేపల్లి– కపటలింగన పల్లికి వెళ్లే రహ దారికి రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సర్పంచ్ శెట్టిగారి మంజునాథ జేసీబీ తో ఆదివారం రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగింపునకు చర్యలు చేపట్టారు.

బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికకు ప్రత్యేక శిక్షణ

కూడేరు: బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక కోసం క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ 9 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆదివారం బెస్ట్ క్యాడెట్ల ఎంపిక కోసం క్యాడెట్లకు ఫైరింగ్‌పై అధికారులు శిక్షణ ఇచ్చారు. క్యాంప్ కమాండర్ కల్నల్ జోబీ ఫిలిప్స్ శిక్షణను పర్యవేక్షించారు. ఏకాగ్రతతో సాధన చేస్తే లక్ష్యాన్ని సాధించొచ్చని క్యాడెట్లకు ఆయన తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. కర్నూలు, అనంతపురం, నంద్యాల, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 530 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. ఫైరింగ్ , మ్యాప్ రీడింగ్, ఆఫ్‌స్టెకల్స్, సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను ఎంపిక చేసి, సికింద్రాబాద్‌లో ఉన్న ఎన్‌సీసీ ట్రైనింగ్ సెంటర్‌కు పంపనున్నట్లు తెలిపారు. అక్కడ ప్రతిభ కనబరిస్తే ఢిల్లీలో జరిగే కార్యక్రమాలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ ఎంఆర్ బాషా, ఎన్‌సీసీ అధికారులు దయామణి, హేమదుర్గా, గంగన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఫైరింగ్‌పై ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న క్యాంప్ కమాండర్ జోబీ ఫిలిప్స్

దారి కాచిన అశుభ గడియలు

- శోకసంద్రంలో మునిగిన ముద్దినాయనపల్లి

కళ్యాణదుర్గం: రాత్రికి భార్య సీమంతం.. తెల్లారితే విందు భోజనం పెట్టాలి... ఇళ్లంతా చుట్టాలతో సందడిగా ఉంటే .. ఇంటి ముంగిట పెద్ద షామియానా వేశారు. వంట సరుకుల కోసం నగరానికి వెళ్లిన గంగాధర్ సమయమవుతున్నా ఇంటికి చేరుకోలేదు. అతని కోసం భార్య,బంధుమిత్రులంతా దారి వైపు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.. అంతలోనే తెలిసింది పిడుగులాంటి వార్త.. పెన్నానది వంతెన వద్ద ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని తెలిసి ఇంటిల్లిపాదీ కుప్పకూలారు. బంధుమిత్రులంతా విషాదంలో మునిగిపోయారు. హృదయ విదారక ఘటనతో కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనిపల్లి శోక సంద్రంలో మునిగింది. బెళుగుప్ప మండలం కాలువపల్లి వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాకే గంగాధర్ (35) మృతి చెందిన విషయం విదితమే. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఆదివారం పోస్టుమార్టం పూర్తయ్యింది. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ముద్దినాయనపల్లికి తీసుకెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులు సాకే గంగాధర్‌ను కడసారి చూసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. భార్య శిల్ప సీమంతం ఘనంగా నిర్వహించాలని పలు మార్లు తమతో చెప్పాడని అనంతపురానికి చెందిన గంగాధర్ మిత్రులు శ్రీనివాసులు, రామ్మోహన్, సాయి తదితరులు విలపించారు.



సాకే గంగాధర్ (ఫైల్)

జాగ్రత్త..ప్రమాదం పొంచి ఉంది!

కూడేరు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మధ్యలో డ్రైనేజీ గుంతపై ఏర్పాటు చేసిన సిమెంట్ మూత విరిగిపడి, ప్రమాదకరంగా మారింది. ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలోనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. నిత్యం విద్యార్థులు,చిన్నపిల్లలు, స్థానికులు, ఉపాధ్యాయులు అటుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఎమ్మార్సీ నుంచి పుస్తకాలు, విద్యాసామగ్రి వాహనాల్లో తీసుకెళ్లాల్సి ఉంటుంది. డ్రైనేజీ కుంగిపోతే వాహనాలు ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. దీనికితోడు విద్యార్థులు, చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.



ఎమ్మార్సీకి వెళ్లే దారిలో డ్రైనేజీపై ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

పంట నష్టపరిహారం అందించాలి

కూడేరు: ఈదురు గాలులు, భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని హంసాయపల్లిలో రైతు రమేష్ నాయుడుకు చెందిన ద్రాక్ష పంట భారీ వర్షానికి నేలకొరిగింది. ఆదివారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి దెబ్బతిన్న ద్రాక్ష పంటను పరిశీలించారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

25న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

ఉరవకొండ: మండలంలోని చిన్న ముస్టూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25న ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 7013800115లో సంప్రదించాలన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉరవకొండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ఈనెల 9 నుంచి 21 వరకు సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీల బృందం క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. రామాయణ గ్రంథాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని బోయ సంఘం మండల అధ్యక్షుడు కేపీ వన్నూరు స్వామి అన్నారు. సాయంత్రం వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు. బోయ సంఘం నాయకులు వన్నప్ప, కేశప్ప, రామాంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో 'పల్లె పండుగ '

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లి ,ఆవులెన్న, ఎర్రగుడి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఏపీఓ సూర్యప్రకాశ్, పీఆర్ ఇంజనీర్ పరుశరాం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గుండ్లపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.11 లక్షలు, ఆవులెన్న గ్రామంలో రూ.9.30 లక్షలు, ఎర్రగుడి గ్రామంలో రూ.9లక్షలు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు.

మూడు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం



ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నుంచి దూర ప్రాంతాలకు నడుస్తున్న పాత బస్సుల స్థానంలో మూడు కొత్త బస్సులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన బస్సులను ఆర్టీసీ డీఎం సురేష్‌తో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు రెండు నూతన సూపర్ లగ్జరీ బస్సులను హైదరాబాద్‌కు, మరో నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును శ్రీశైలానికి నడుపుతున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కూడేరు: మండలంలోని గొటుకూరు సమీపంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 8,170 నగదు, ఐదు సెల్ ఫోన్లు , ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

చినుకు పడితే చాలు వీధులన్నీ ఛిద్రం




శెట్టూరులో సీసీ రోడ్డుపై పాచిపట్టిన దృశ్యం



శెట్టూరు ఎస్సీకాలనీలో బురదగుంట

శెట్టూరు: మండలంలోని పలు గ్రామాల్లోని వీధులు వర్షం వస్తే చాలు.. చిత్తడిగా మారుతున్నాయి. శెట్టూరు మండల కేంద్రం, చిన్నంపల్లి, ములకలేడు, కనుకూరు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వీధులన్నీ బురదమయంగా మారాయి. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో పాచిపట్టి, అధ్వానంగా ఉన్నాయి. రోడ్లపై అడుగుతీసి అడుగువేయాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. వీధుల్లో అపరిశుభ్రతతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో శెట్టూరు, చిన్నంపల్లి, బసంపల్లి గ్రామాల్లో ప్రజలు జ్వరాలబారిన పడిపోయారు.

జడివానతో వీధులు చిత్తడే
రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే బురద దాటుకుని వెళ్లాల్సిందే. తుఫాను కారణంగా మూడురోజుల నుంచి జడివాన పట్టుకోవడంతో కార్యాలయ ఆవరణాలు బురదమయంగా మారాయి. ఎదురెదురుగా ఉన్న తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయ గేటు బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. వర్షపునీరు వెళ్లే మార్గం లేక నీరు నిలిచి బురదమయంగా మారుతోంది.



శెట్టూరు: ములకలేడు అంబేడ్కర్ నగర్‌లో రోడ్డుపై ఇలా..



రాయదుర్గంలో కూరగాయల మార్కెట్ వెనుక వైపు ఓబులాచారి రోడ్డులో ఇలా..



రాయదుర్గంలో మధుటాకీస్‌కు వెళ్లే దారిలో రోడ్డుపైనే నిలిచి ఉన్న నీరు